క్లుప్తంగా

వరల్డ్ విజన్ సేవలు అభినందనీయం


ఫుడ్‌బాస్కెట్ అందిస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వర్

లక్ష్మణచాంద: వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 88 మంది బాలింతలు, గర్భిణులకు రూ.88వేల విలువైన ఫుడ్ బాస్కెట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఫుడ్‌బాస్కెట్ ద్వారా పోషకాహారం అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, వరుణ్, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

లక్ష్మణచాంద: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ప్రజలు తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని ఏఎన్ఎం సుగుణ సూచించారు. బుధవారం మండలంలోని తిర్పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా పలువురికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కంటివెలుగు అద్దాలు పంపిణీ చేశారు.

సర్కారు బడుల్లోనే చేర్పించాలి

సారంగాపూర్: సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలూరు గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సర్పంచ్ రాధ, వైస్‌ఎంపీపీ పతాని రాధ, చించోలి(బి) ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

కూలిన చెట్టు తొలగింపు


చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో పద్మశాలి కాలనీలో మురుగుకాల్వలో చెట్టు కూలింది. దీంతో మురుగు నీరు అక్కడే నిలుస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈనెల 27న 'సాక్షి'లో కాల్వలోంచి చెట్టు తొలగించరూ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు బుధవారం కాల్వలో పడిన భారీ వృక్షాన్ని తొలగించి నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

ముధోల్: బక్రీద్ నేపథ్యంలో గోవులను అక్రమంగా తరలించకుండా ముధోల్ శివారులోని ధర్మాబాద్ రోడ్ వద్ద బుధవారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా గోవులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

నామినీ వివరాలు సేకరణ

సోన్: మండలంలోని మాదాపూర్‌లో ఈ నెల 25న బండారి చిన్నన్న అనే రైతు మృతి చెందాడు. మృతుడికి రైతుబంధు వర్తిస్తుండటంతో బుధవారం ఏఈఓ అశోక్ వారి ఇంటికి వెళ్లి నామినీ వివరాలు సేకరించారు. సర్పంచ్ రాజనర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.



పీవీ గారు.. మన్నించండి

జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎక్స్‌రోడ్డులో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు చేసి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా.. ఆవిష్కరణకు నోచుకోవడం లేదు. బుధవారం ఆయన జయంతి నిర్వహిస్తారని ఆశించినా నిరాశే మిగిలింది. కనీసం వచ్చే వర్ధంతి నాటికైనా విగ్రహం ఆవిష్కరించాలని పలువురు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కుభీర్‌లో అధ్వానంగా పారిశుధ్యం

10వేల జనాభా ఉన్న కుభీర్ మండల కేంద్రంలో మురుగుకాల్వలు అధ్వానంగా మారాయి. పలుచోట్ల పూడిక పేరుకుపోగా.. మరికొన్ని చోట్ల పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో కాల్వల్లో మురుగు ఎక్కడికక్కడ నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని.. అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించాలని కుభీర్‌వాసులు వేడుకుంటున్నారు. మండల కేంద్రంలో పశువైద్యశాల నుంచి ఉన్నత పాఠశాల మీదుగా మహాలక్ష్మి ఆలయం వరకు ఉన్న కాల్వతోపాటు జీబు అడ్డా గుండా వడ్డెర, మేదరి కాలనీ, పోలీస్‌స్టేషన్ ముందు నుంచి వాగు వరకు ఉన్న కాల్వలో పూడిక పేరుకుపోయి అధ్వానంగా మారింది. ఈ విషయమై ఈవో విజయ్ మాట్లాడుతూ త్వరలో పొక్లెయిన్లతో కాల్వలను శుభ్రం చేయిస్తామన్నారు. – కుభీర్


బట్టిగల్లీ హనుమాన్ మందిరం వద్ద మురుగుకాల్వ దుస్థితి


పశువైద్యశాల వెనకాల పిచ్చిమొక్కలతో నిండిన మురుగు కాలువ


పోలీస్‌స్టేషన్ ఎదుట పిచ్చిమొక్కలు పెరగడంతో కన్పించని మురుగుకాల్వ


మేదరి ఇళ్ల వద్ద మురుగుకాల్వలో పేరుకుపోయిన పూడిక


వడ్డెరకాలనీలో నిలిచిన మురుగునీరు

ఈద్గాల వద్ద ఏర్పాట్లు పరిశీలన


ఖానాపూర్‌లో పరిశీలిస్తున్న నాయకులు


భైంసాలో శుభ్రం చేయిస్తున్న వెంకటేశ్వర్లు

ఖానాపూర్: బక్రీద్‌ను పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గాలో ప్రార్థన చేసే స్థలం వద్ద ఏర్పాట్లను బుధవారం ముస్లిం, మైనార్టీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, జామ మసీద్ అధ్యక్షుడు అంజద్‌ఖాన్ తదితరులున్నారు.

భైంసాటౌన్: బక్రీద్ నేపథ్యంలో భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ వద్ద ఈద్గాలో మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ముస్లింల ప్రార్థనల కోసం ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

నిర్మల్‌టౌన్: బక్రీద్ పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థన స్థలాన్ని బుధవారం ముస్లిం మతపెద్దలతో కలిసి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ప్రార్థనాస్థలం వద్ద తాగునీరు, టెంట్ సౌకర్యాలు కల్పించామన్నారు. మతపెద్దలు, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

'సర్వే చేసి పట్టాదారులుగా గుర్తించాలి'


వినతిపత్రం ఇస్తున్న మొగిలి గ్రామ రైతులు

భైంసాటౌన్: ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించి తమను పట్టాదారులుగా గుర్తించాలని తానూరు మండలం మొగిలి గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. ఈమేరకు బుధవారం భైంసాలోని ఆర్డీవో కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావు సింధే ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాల జీవో కింద గ్రామంలో భూములు ఇవ్వడంతో తమ పూర్వీకుల కాలం (1930 నుంచి) సాగు చేసుకుంటున్నామన్నారు. సర్వే చేసి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు షేక్ సద్దాం, ఉస్మాన్, బాలాజీ, ముత్తన్న తదితరులు ఉన్నారు.

మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

తానూరు: మసీదుల అభివృద్ధికి కృషి ప్రభుత్వం కృషి చేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మసీద్ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల కోసం ఫంక్షన్ హాలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, చంద్రకాంత్ యాదవ్, సర్పంచ్ విఠల్, నాయకులు ఉన్నారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని విఠపూర్ సర్పంచ్ లక్ష్మీ తండ్రి గజ్జారాం ఇటీవల మృతి చెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట నాయకులు రమేశ్, సుదర్శన్‌రెడ్డి, అశోక్, లక్ష్మణ్, రవి, కాంత్‌రావుపటేల్, రాజు, తదితరులు ఉన్నారు.

సేంద్రియ విధానంలోనే పండించాలి

సారంగాపూర్: పోషకవనాలు, కిచెన్‌షెడ్లలో కూరగాయలను పూర్తిగా సేంద్రియ విధానంలోనే పండించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో పోషకవనంలో బుధవారం చిక్కుడు, బీర, కాకర తదితర విత్తనాలు నాటారు. ఆయన మాట్లాడుతూ పోషక వనంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని పేర్కొన్నారు. రెండేళ్లుగా ఆలూరు పోషకవనంలో కూరగాయల సాగుతో చిన్నారులకు సేంద్రియ కూరగాయలతో పోషకాహారం అందించామన్నారు. వారి వెంట మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధ, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సర్పంచ్ దండురాధ, చించోలి(బి) ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి, నాయకులు సాయికృష్ణ, బుచ్చన్న, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

వారంలోగా పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో గ్రంథాలయంలో రూ.లక్షతో చేపడుతున్న మరమ్మతులను వారంలోగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా గ్రంథాలయ నిర్మాణానికి సహకరిస్తున్న గ్రామాభివృద్ధి కమిటీని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకుల నాగయ్య, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు సాగర్, ఎస్ఎంసీ చైర్మన్ జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, పెద్ద లస్మన్న, దశరథ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


గొల్లమాడలో చెక్కులు అందజేస్తున్న రాజేశ్వర్

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో బుధవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల కన్వీనర్ పాపెన్ రాజేశ్వర్ అందజేశారు. గ్రామానికే చెందిన చిన్న గంగాధర్‌కు రూ.20 వేలు, నడుకుడ కిషన్‌కు రూ.15 వేలు, చిన్న పెద్ద లస్మన్నకు రూ.19,500, ఒలికిరి రాములుకు రూ.16 వేలు, గణేశ్‌రావుకు రూ.30 వేల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి రమేశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కుమ్మరి భాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన అబ్బడి భోజవ్వకు రూ.55 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ మేరకు బుధవారం చెక్కును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి.. తిర్పెల్లిలో భోజవ్వకు అందజేశారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగారెడ్డి, మునిపెల్లి ఉపసర్పంచ్ రమేశ్, తిర్పెల్లి ఉపసర్పంచ్ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి అజేశ్‌కుమార్

మామడ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నిర్మల్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ అన్నారు. బుధవారం మామడలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. చట్టాలను తెలుసుకుంటే సమస్యలు రాకుండా జాగ్రత్త పడొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ విజ్ఞాన కమిటీ న్యాయవాదులు రాజలింగం, లింగాగౌడ్, దేవిదాస్, మధుకర్, రాజు తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

ముధోల్: మండంలోని ఎడ్‌బిడ్ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహీంద్ర ట్రాక్టర్ షోరూం భైంసాశాఖ ఆధ్వర్యంలో మేనేజర్ మధుసూదన్ నోట్‌బుక్‌లు అందజేశారు. బుధవారం ఒక్కో విద్యార్థికి ఎనిమిది నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. మేనేజర్ మాట్లాడుతూ పట్టుదలతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు రవిబాబు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	90
వంకాయ	40
బెండకాయ	60
పచ్చిమిర్చి	100
కాకరకాయ	70
బీరకాయ	60
క్యారెట్	120
గోరుచిక్కుడు	50
కొత్తిమీర	120
అల్లం	200
ఎల్లిగడ్డ	140
ఉల్లిగడ్డ	30
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : స్పై
నారాయణ : ఆదిపురుష్

సంక్షిప్త వార్తలు

పుస్తక పఠనంతోనే జ్ఞానం

కుంటాల: జ్ఞానం పెంచుకునేందుకు విద్యార్థులు నిత్యం పుస్తక పఠనం చేయాలని కుంటాల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గజపెల్లి నర్సయ్య పేర్కొన్నారు. పఠనోత్సవంలో భాగంగా బుధవారం విద్యార్థులను గ్రంథాలయానికి తీసుకెళ్లి పలు అంశాలపై అవగాహన కల్పించారు.హరీశ్, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి చేన్లు పరిశీలించిన శాస్త్రవేత్తలు

ముధోల్: ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం ఏవో భాస్కర్‌తో కలిసి అధిక సాంద్రత విధానంలో విత్తిన చేన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డా.కె.విజయ్‌కుమార్, కార్తీక్ రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవో ప్రవీణ్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రాథమిక వైద్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. వైద్యులు నాగరాజు, ప్రశాంతి, రాజేశ్వరి, ఆశావర్కర్ గోదావరి పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు వైద్యపరీక్షలు

భైంసాటౌన్: పట్టణంలోని ఐదో నంబర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులు, చిన్నారులకు ఏరియాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. వైద్యులు అనిల్‌జాదవ్, అంగన్‌వాడీ టీచర్, ఆయా, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆలయాల ముస్తాబు

కుంటాల: ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని ఓలాలోని శ్రీశ్రీశ్రీ విఠలేశ్వర రుక్మాబాయి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 6:30 నుంచి 8:30 గంటల వరకు పంచామృతంతో మహాభిషేకం, ఉదయం 10గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. కుంటాలలో శ్రీకృష్ణ ఆలయంలో ఏకాదశికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఖాతాదారుల సేవా కేంద్రం ప్రారంభం

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఆ బ్యాంకు నర్సాపూర్(జి)శాఖ మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సబ్ కమిటీ జిల్లా కస్టమర్, రిలేషన్‌షిప్ ఆఫీసర్ తోట రాజేశ్వర్, నిర్వాహకులు శ్రీకాంత్, నిఖిత పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. బురద తిప్పలు తప్పేదెన్నడు.?



ఖానాపూర్: పట్టణంలో రెండేళ్ల కిందట ప్రారంభమైన రోడ్డు వైడింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో జాప్యం కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారాయి. అధికారులు స్పందించి ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, మున్సిపల్ కమిషనర్, ఖానాపూర్, ఫోన్: 78421 50545